క్లుప్తంగా

ఇటిక్యాలపాడులో అల్లు అర్జున్



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న గురునానక్ దాబాలో అల్లు అర్జున్ మధ్యాహ్నం భోజనం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి నంద్యాల జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్ప రవి చంద్రా కిషోర్ రెడ్డికి మద్దతుగా నంద్యాలకు వెళ్లారు. హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలో వద్ద ఆగి మధ్యాహ్నం భోజనం చేశారు. గమనించిన అభిమానులు ఫొటోలు, సెల్ఫీలతో ఎగబడ్డారు. దాబా యజమాని తిరుపాల్‌సింగ్, కుటుంబసభ్యులతో మాత్రమే ఫొటో దిగేందుకు అంగికరించారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలాక్షేత్రం



మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి వచ్చిన భక్తులతో ఆదిశిలాక్షేత్రం ఆవరణ మొత్తం పోటెత్తింది. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, రవి చారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. కొంతమంది భక్తులు స్వామి వారికి దానంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదిశిలా క్షేత్రం, కృష్ణస్వామి ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అరవిందరావు, చంద్రశేఖర్ రావు, నాగరాజుశర్మ, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ, వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

అన్నదమ్ముల గొడవ : కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గ్రామంలో డ్రైయినేజీలో మురుగు నిల్వపై అన్నదమ్ములకు మాట మాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో అన్నపై తమ్ముడు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల ప్రకారం.. బోయ శ్రీనివాసులు, వెంకటేశ్వరు అన్నదమ్ములు. పక్కపక్క ఇళ్లలో ఉంటారు. ఇంటి ముందు డ్రైయినేజీ కాల్వలో మురుగు నిల్వ ఉండడంతో అన్న వెంకటేశ్వర్లు తమ్ముడిపై గొడవకు దిగాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరిగి వెంకటేశ్వర్లు అతని భార్య, కుటుంబ సభ్యులు కలిసి శ్రీనివాసులుపై దాడి చేశారు. శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.6,200

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శనివారం 197 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6,200, కనిష్టం రూ.1,500, సరాసరి రూ.6,200 ధరలు పలికాయి. అలాగే, 10 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5,491, కనిష్టం రూ.5340, సరాసరి రూ. 5340 ధరలు వచ్చాయి. వీటితోపాటు 948 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ. 2359, కనిష్టం రూ. 1702, సరాసరి ధర రూ. 2289 ధరలు వచ్చాయి. 41 క్వింటాళ్ల వరి (హంస) రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి ధర రూ. 1702 ధర పలికింది. క్వింటాల్ కంది రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి ధర రూ. 10106 ధర వచ్చింది.

జోగులాంబ సన్నిధిలో ప్రముఖులు



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదోవమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాన్ని శనివారం ఐటీబీఎఫ్ అడిషనల్ ఎస్పీ హరీష్, కర్నూలు జిల్లా ట్రైనీ ఎస్పీ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో రాత్రి ప్రదోశకాలంలో జరిగే దశవిధహారతి కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

ఎన్నికల్లో బాధ్యతగా విధులు నిర్వహించాలి



ఎన్నికల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ రితిరాజ్

ఎర్రవల్లిచౌరస్తా: 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని ఎస్పీ రితిరాజ్ సూచించారు. శనివారం బీచుపల్లి పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో ట్రెయినీ పోలీస్ సిబ్బందికి ఎన్నికల రోజు పాటించాల్సిన నియమాలపై అందిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి ఒక్కరిని క్యూ పద్ధతిలోనే పోలింగ్ కేంద్రంలోకి ఒక్కొక్కరిగా అనుమతించాలని, గుంపులుగా ఉండనివ్వకుండా ప్రిసైడింగ్ అధికారి సలహా మేరకు నడుచుకోవాలని తెలిపారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఎవరిని కూడా లోపలికి పంపించకూడదని, ఒకవేళ అప్పటికే క్యూలో ఉంటే పోలింగ్ అధికారి వారికి స్లిప్స్ అందించడం జరుగుతుందన్నారు. ఎట్టిపరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం వద్ద తమ డ్యూటీ స్థలాన్ని వదిలి వెళ్లరాదని ఆదేశించారు. ఎవరికైనా పోలింగ్ కేంద్రం వద్ద శాంతి భద్రతలకు సంబంధించిన సమస్య ఉందని భావిస్తే వెంటనే రూట్ మొబైల్ ఇంచార్జి అధికారికి లేదా సమస్య అధికంగా ఉంటే స్థానిక ఎస్సైలు లేక నోడల్ పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, అలంపూర్ సిఐ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



ఎర్రవల్లిలో ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌ను నుంచి అయిజకు వెళ్తుండగా ఎర్రవల్లి కూడలిలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఎంపీ అభ్యర్థి మల్లు రవిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూల బొకేలను అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. తిరుగు ప్రయాణంలో కొండేరు శివారులోని ఎస్‌ఎమ్‌ఆర్ దగ్గర వాల్మీకి నాయకులు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సభ దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, పోతురాజు సోమనాద్రి, నర్సింహులు, గట్టు తిమ్మప్ప, ఎల్కూరు శ్రీను, మధు నాయుడు, రాదమ్మ, వాల్మీకి నాయకులు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రచార ఘట్టం

- ర్యాలీలు, సభలతో హోరెత్తించిన పార్టీలు

గద్వాల: ' అన్నా... దండం పెడ్తున్నా.. మళ్లీ కలుస్తా.. వదినా.. జర యాదించుకో.. '

'సార్.. ఈ ఒక్కసారి అవకాశం ఇవ్వండి. మళ్లీ కలుస్తా..'

ఇంటింటి ప్రచారం.. పాదయాత్రలు.. ప్రదర్శనలు.. ర్యాలీలు.... వీధులలో హోరెత్తే మైకులు.. శనివారం నాటితో మూగబోయాయి. రెండు వారాల పాటు హోరెత్తిన ప్రచారానికి తెరపడింది. ఇక పంపకాలపైనే దృష్టి మరల్చారు. గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల మధ్య 'నువ్వా.. నేనా' అన్నట్లుగా ప్రచారం సాగింది. మొదట మందకొడిగా సాగినా, అగ్ర నాయకుల పర్యటనలతో ఊపందుకుంది. కొంతమంది వారం రోజుల నుంచే ప్రచారం చేశారు. నడిగడ్డ వ్యాప్తంగా హోరెత్తిన ఎన్నికల ప్రచార ఘట్టానికి శనివారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. చివరిరోజు కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు మండల కేంద్రాల్లో బహిరంగ సభలు నిర్వహించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంతమంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సైతం కార్యకర్తల సమావేశాలతో పాటు రెండు నియోజవర్గాలలో బహిరంగ సభలు నిర్వహించారు. గద్వాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి అన్నీ తానై పార్టీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుకోసం నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ సరిత కాంగ్రెస్ పార్టీ తరపున ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ అభ్యర్థి మల్లురవి గెలుపు బాధ్యతలను తన భుజాన వేసుకున్నారు. బీజేపీ నాయకుడు రామచంద్రారెడ్డి, రామంజనేయులు ప్రచార బాధ్యతలు చేపట్టి పార్టీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం శ్రమించారు. సాయంత్రం ప్రచార ఘట్టం ముగిసినప్పటికీ ఆయా పార్టీలకు చెందిన నాయకులు, అభ్యర్థులు వాట్సాప్ మెసేజ్‌లు, వాయిస్ మెసేజ్‌లతో హోరెత్తిస్తూనే ఉన్నారు. ప్రచార ఘట్టం ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు నియోజకవర్గ వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సెక్టోరియల్ అధికారి



ఉండవెల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సెక్టోరియల్ అధికారి

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, కంచుపాడు, చిన్న ఆముదాలపాడు, బస్వాపురం, బైరాపురం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను మండల సెక్టోరియల్ అధికారి, ఎంపీడీఓ అబ్దుల్ జబ్బార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, బాత్రూంలు, సీసీ కెమెరాలు, బెంచీలు, పోలింగ్ బూత్ నెంబర్లు, బూత్ లెవల్ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వీల్ చైర్ ఒక్కటే ఉండడంతో ఇబ్బంది తలెత్తుందేమో నని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, బూత్ లెవల్ ఆఫీసర్లు, సీసీ కెమెరా సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



ధరూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ధరూరు: గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో కవాతును నిర్వహిస్తోంది. శనివారం సాయంత్రం మండల సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంల్లో పుర వీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇన్సిడెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీసుశాఖ కృషి చేస్తోందన్నారు. జిల్లా పోలీస్ ఫోర్స్‌కు అదనంగా 100 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్ వచ్చిందన్నారు.ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పడేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎవరికి భయపడకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఓటర్ల ధైర్యం కోసమే కవాతు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు, తక్కశిల గ్రామాల్లో ఐటీబీపీ జవాన్లు ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. కంచుపాడులో బస్టాండ్ నుంచి ఆలయం వయా గ్రామ చివరి వరకు కవాతు నిర్వహించారు. తక్కశిలలో చర్చి నుంచి మిట్టపాడు వరకు జవాన్లు కవాతు నిర్వహించారు. పోలీస్ సిబ్బంది నాగేష్, హుస్సేన్ పాల్గొన్నారు.

103 లీటర్ల మద్యం పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని అన్ని రహదారుల్లో పోలీసులు, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, చెక్‌పోస్టు అధికారులు 103.86 లీటర్ల మద్యం పట్టుకుని ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. దాదాపు మద్యం రూ.96,380 విలువ ఉంటుందని అంచనా వేశారు.

పట్టణంలో మురుగు చెరువులు!

- డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- కంపు కొడుతున్న మున్సిపాలిటీలు
- చిన్నవానలకే ఇళ్లలోకి చేరుతున్న నీరు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



రామచంద్రానగర్ పట్టణ దవాఖాన సమీపంలో నిలిచిన వర్షపునీరు

శాంతినగర్: ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కొన్ని పట్టణాలను ప్రభుత్వం మున్సిపాలిటీలుగా ప్రకటించింది. దీంతో వడ్డేపల్లి, అలంపూర్ పట్టణాలు కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పడ్డాయి. ఆయా మున్సిపాలిటీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో సౌకర్యాలు లేక ప్రజలు సతమతమవుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తేచాలు లోతట్టు ప్రాంతాలు జల మయమై చెరువులను తలపిస్తుంటాయి. నీరు నిలిచి దోమలు, పందులకు ఆవాసాలుగా మారి రోగాలు విజృంభించి పట్టణవాసులు రోగాల బారిన పడుతూ భయాందోళనకు గురువుతున్నారు. ఈ విషయమై ఆయా మున్సిపాలిటీలకు చెందిన చైర్మన్లు, కమిషనర్లు స్పందించి ఇళ్ల సమీపంలో వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుని పట్టణ వాసులు రోగాల బా రిన పడకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది.

ముంపునకు గురవుతున్న కాలనీలు

భారీ వర్షాలు కురిస్తే ఆయా కాలనీలు ముంపుకు గురై నష్టం వాటిల్లడమేగాక వ్యాధుల బారిన పడి సతమవుతుంటారు. వడ్డేపల్లి పుర పరిధిలోని జమ్ములమడుగు, రామచంద్రానగర్, ఇందిరానగర్ కాలనీలు వర్షాకాలం వచ్చిందంటే వారి పరిస్థితి విషమంగా ఉంటుంది. వర్షం నీరు నిలిచి కంపు కొడుతూ ఇళ్లలో ఉండలేని పరిస్థితులు ఉన్నాయి.

మురుగు నిలిచి..

ఆయా కాలనీల సమీపంలో డ్రైయినేజీల్లో పారుదలయ్యే మురుగు నీరు నిలిచి ముందుకు వెళ్లకపోవంతో దుర్గంధం వెదజల్లుతోందని పట్టణ వాసులు వాపోతున్నారు. రామచంద్రానగర్, జమ్ములమడుగు కాలనీల సమీపంలో వెళ్తున్న ప్రధాన డ్రైయినేజీ కాల్వ అంతంతమాత్రమే ఉండటంతో మురుగునీరు ఇళ్ల సమీపంలో నిలిచి కంపు కొడుతుంటుందని ప్రజలు వాపోతున్నారు. ఇందిరానగర్ కాలనీ సమీపంలో శాంతినగర్‌లోని మురుగు నీరంతా చేరి మడుగును తలపిస్తుంది. దీంతో ఇందిరానగర్ కాలనీలోని ప్రజలు దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధాన డ్రైయినేజీ కాల్వ నీటిని దూరం తీసుకువెళ్లకుండా కాలనీ సమీపంలో వదిలేయడంతో కంపు కొడుతూ ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్తగా సీసీరోడ్లు వేసినప్పటికి డ్రైయినేజీ కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరుకు దారులు లేక ఇళ్లమధ్యలో నిలిచి ఇబ్బందికరంగా ఉంటుందని పట్టణ వాసులు వాపోతున్నారు.

ప్రైవేటు ఖాళీ ప్లాట్లతో సమస్యలు

చాలామంది ప్రైవేటు వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేసి వదిలేశారు. దీంతో ఖాళీ జాగాల్లో ముళ్లపొదలు దట్టంగా పెరిగి, వర్షపునీరు నిలవడంతో ఆయా కాలనీల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. విష సర్పాలు సంచరించడం, పందుల బెడదతో ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్ ప్లాట్ల వ్యక్తులపై చర్యలు తీసుకుని ఖాళీ జాగాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

ఇళ్లలో ఉండలేని పరిస్థితి..



రామచంద్రానగర్ కాలనీ సమీపంలో పెద్ద డ్రైయినేజీ కాల్వ ప్రవహిస్తోంది. కాల్వలో మట్టిపడి తరచూ నీరు నిలిచి దుర్గంధం వస్తోంది. పట్టణ దవాఖాన సమీపంలో ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. నిలిచిన నీటి వల్ల కంపు కొడుతోంది. నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తే ఇబ్బందులు ఉండవు.

– నజీర్, రామచంద్రానగర్ కాలనీ, వడ్డేపల్లి

దోమలతో తరచూ రోగాలు



మా ఇళ్ల సమీపంలో డ్రైయినేజీ కాల్వలో మురుగు నీరు నిలిచి కంపుకొడుతోంది. నీటిలో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటోంది. మురుగునీటితో పాటు వర్షపునీరు కలిసి మరింత ఇబ్బందిగా మారింది. పందులు, కుక్కలు చేరి ఇళ్ల ముందుకు వస్తున్నాయి. మురుగునీరు, వర్షపునీరు నిల్వకుండా చూడాలి.

– లక్ష్మి, రామచంద్రానగర్ కాలనీ, వడ్డేపల్లి

చర్యలు తీసుకుంటాం

వర్షపునీరు, మురుగు నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం. రామచంద్రానగర్, జమ్ముల మడుగు కాలనీలు లోతట్టు ప్రాంతాలు కావడంతో వర్షాకాలంలో సమస్య వస్తోంది. మున్సిపల్ సిబ్బందికి సూచనలిచ్చి మురుగునీరు, వర్షపునీరు నిల్వకుండా చూడాలని ఆదేశాలిచ్చాను. సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మారెడ్డి, కమిషనర్, వడ్డేపల్లి

బీజేపీతోనే దేశాభివృద్ధి



అంతంపల్లిలో బీజేపీ నాయకుల ప్రచారం



ఉండవెల్లిలో బీజేపీ ప్రచారంలో బైక్ ర్యాలీ

గట్టు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, ఓటర్లు బీజేపీకి ఓటు వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి కోరారు. శనివారం అంతంపల్లి గ్రామంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింట తిరుగుతూ బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి సమక్షంలో పలువురు బీజేపీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మధుసూదన్‌రావు, బల్గెర శివారెడ్డి, వీరశేఖర్‌గౌడు పాల్గొన్నారు.

మానవపాడు: భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని, బీజేపీ గెలుపు తథ్యమని మండల అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రలో అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, తప్పకుండా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భారత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రవి, నాగరాజు, తిమ్మప్ప, బాబు పాల్గొన్నారు.

శాంతినగర్: దేశంలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఎంతో మందికి చేయూత అందించిన బీజేపీని ప్రజలు ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులోని 167,168 బూత్‌లలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బూత్ అధ్యక్షుడు శివ, మనోహర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తల ర్యాలీ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు పిడుగు వెంకటేష్ ఆధ్వర్యంలో బీజేపీ యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు దేశంలో మోదీ చేసిన అభివృద్ధిని వీధివీధి ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు శ్రీపాదరెడ్డి అన్నారు. మండలంలోని గువ్వలదిన్నెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్ నాయక్, వాచ్యనాయక్ ఉన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల అధ్యక్షులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి కర పత్రాలను పంపిణీ చేసి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే కమలం పువ్వుగుర్తుకు ఓటు వేసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ను అధిక మెజారిటీతో గెలిపించి ముచ్చటగా మూడోసారి మోదీజీని ప్రధాని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.

ధరూరు: బీజేపీ బలపరిచిన భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గొంగ్లళ్ల రంజిత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం ముందు పెద్ద చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న ప్రతి ఒక్కరు పాల్గొని ఓటు వేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



బల్గెరలో ఉపాధి కూలీల దగ్గర ప్రచారం నిర్వహిస్తున బీఆర్‌ఎస్ నాయకులు



కేటీదొడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో బీఆర్‌ఎస్ నాయకులు సీతారామిరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, అరుణ్‌కుమార్, చిన్నకుర్మన్నలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలేదని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గట్టు: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ నాయకులు గట్టు, బల్గెర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటి తిరిగి కారుగుర్తు ఓటు వేయాలని కోరారు. బల్గెరలో జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతునాయుడులు ఉపాధి పనులు దగ్గరకు వెళ్లి కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

కేటీదొడ్డి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, గోవిందు, నసీర్, కొండన్న, యుగంధర్, వీరేష్ ఉన్నారు.

మల్దకల్: కేసీఆర్‌తోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ నాయకులు విక్రంసింహారెడ్డి, వెంకటన్న, పరశురాముడు అన్నారు. మల్దకల్, అమరవాయి, తాటికుంట, నాగర్‌దొడ్డి గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెంకటన్న, నరేందర్, నర్సింహులు, మధు, నారాయణ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు గడపగడపకు తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. 13న జరిగే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేసి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు.

ధరూరు: పార్లమెంట్ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంది. రెండు రోజులుగా గ్రామాల్లో ప్రధాన పార్టీల నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. అందులో భాగంగానే శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే సతీమణి బండ్లజ్యోతి, మాజీ సర్పంచు శ్రీనివాస్‌రెడ్డిలు మండల కేంద్రంలోని చెరువు వద్ద ఉపాధి కూలీలను కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. మండల పరిధిలోని ఓబులోనిపల్లిలో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



మానవపాడులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



ధరూరు నుంచి గద్వాలలో డిప్యూటీ సీఎం రోడ్ షోకు తరలి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో చివరి రోజు కాంగ్రెస్‌పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు దీపక్‌ప్రజ్ఞ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మారుతినగర్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో శనివారం కాంగ్రెస్ మండల నాయకులు భారత్‌భూషణ్‌రెడ్డి, పరమేష్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నికల ప్రచారం జోరుగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేసి హస్తం గుర్తుకు ఓటు వేసి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ధరూరు: కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మండల కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బైపాస్ రోడ్డులో దుకాణ సముదాయాల వద్ద ప్రచారం నిర్వహించారు. అనంతరం గద్వాలలో జరిగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రోడ్ షోకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి తరలి వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజారెడ్డి, జాకీర్, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, కుర్వ శ్రీను, దేవన్న పాల్గొన్నారు.